ప్రజాశక్తి

సోమవారం 4 సెప్టెంబర్ 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఉసూరుమంటున్న రైతు

◆ జలాశయాల కింద పొలాలు తడుపుకొని దమ్ములు
◆ నిర్వహణలేక కాలువలు అస్తవ్యస్తం ◆ తాండవ మెయిన్‌గేట్‌కు లీకేజీలు
◆ వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్‌లో నెలకొన్న వర్షాభావంతో ఉడుపులకు అదును పోయింది. ఆకులు ముదిరిపోయాయి. ఉడిసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న వరి పంటను చూసి రైతు ఉసూరుమంటున్నాడు. పంటలతో పచ్చగా కనిపించాల్సిన పల్లెలు పగుళ్ల భూములతో దర్శనమిస్తున్నాయి. వరి పొలాల్లో గాబులు తీయాల్సిన రోజుల్లో గేదెలు మేపుకుంటున్న దుస్థితి ఏర్పడింది. నిధుల్లేక ఖరీఫ్‌కు ముందు జలాశయాలు, కాలువలు నిర్వహణ చేపట్టలేదు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందక కాలువలకు ఆనుకొనివున్న భూముల్లో దమ్ముకాలేదు. ఆకులు తడుపుకొని, పొలాలకు మోటార్లు పెట్టుకొని, నీళ్ల మోసుకొని ఉడుపులు చేస్తున్న పరిస్థితి వుంది.



చింతమాను పొలంలో ఎండిపోతున్న వరి



పెద్దేరు నీరు రాక బకెట్లతో నీరు తెచ్చి దమ్ము చేస్తున్న కవగుంట రైతులు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2,04,980 ఎకరాలకు సెప్టెంబరు 2 నాటికి 84,847 ఎకరాల్లో సాగైంది. గతేడాది ఇదే కాలానికి 1,38,140 ఎకరాల్లో పంటలు నమోదయ్యాయి. 2,04,980 సాధారణ సాగు విస్తీర్ణంలో వరిపంట భాగం అత్యధికం. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు సెప్టెంబరు 2 నాటికి మిగతా 2లో..

నిరుద్యోగ సమస్యపై సిపిఎం ర్యాలీలు

విశాఖలో యూత్ మార్చ్ ◆ అనకాపల్లిలో కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి - విశాఖ, కలెక్టరేట్, అనకాపల్లి విలేకరులు

నిరుద్యోగ సమస్యపై సిపిఎం సమరభేరిలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించారు. వీటిలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల పేరిట ఎలా మోసం చేశాయో సిపిఎం, యువజన సంఘం నేతలు వివరించారు.



విశాఖలో చేపట్టిన ర్యాలీలో జగ్గునాయుడు తదితరులు

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రింగ్ రోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పెద్ద పెట్టున నినదించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం కోరలు చాస్తోందని, దానిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. మోడీ 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ ఆచరణలో సంవత్సరానికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఒక కోటీ యాభై లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పాయారని మిగతా 2లో..



అనకాపల్లిలో జరిగిన కాగడాల ప్రదర్శనలో మాట్లాడుతున్న లోకనాథం

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

వార్త 8లో..

కలుషిత నీటి సమస్యపై విచారణ

వార్త 2లో..

విద్యుత్ అవాంతరాల నివారణకు చర్యలు

ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యుత్ అవాంతరాలను నివారించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఇఆర్‌సి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా ఉంటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్తు సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వుండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతోందన్నారు. దీంతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం, వాటి ప్రస్తుత ధరలను పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అనుమతించిందని పేర్కొన్నారు. అందులో భాగంగా సంస్థ పరిధిలోని నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిప్ట్ మాత్రమే పని చేయాలని, సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదని తెలిపారు. వారానికి ఒకరోజు పవర్ హాలీడేను కూడా అమలు చేయాలని సూచించారు. పవర్ హాలీడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు వారాలపాటు పవర్ హాలీడే అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లకు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలు మినహాయించబడ్డాయని పేర్కొన్నారు. నియంత్రణ చర్యలను పాటించని పరిశ్రమలకు మిగతా 2లో..

క్రూయిజ్ టెర్మినల్‌తో విశాఖ అభివృద్ధి

వార్త 8లో..

మొదటి పేజీ తరువాయి..

ఉసూరుమంటున్న రైతు

62,775 ఎకరాల్లో (46 శాతం) సాగైంది. ఉడుపుల గడువు ముగిసే నాటికి సగం కూడా సాగుకాని పరిస్థితి వుంది. జిల్లాలో జూన్ ఒకటి నుంచి సెప్టెంబరు 2 వరకు 488.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా 397.3 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటు వర్షపాతంలో – 19 శాతం లోటువుంది. 24 మండలాలకు 11 మండలాల్లో వర్షపాతం లోటువుంది. ఈ లోటు ఖరీఫ్ ఆరంభం నుంచి కొనసాగుతూనేవుంది. ఏటా ఖరీఫ్‌కు ముందు జలాశయాల మరమ్మతులు, కాలువల నిర్వహణ పనులు పూర్తిచేసి సాగునీరు విడిచిపెట్టే సాంప్రదాయం వుండేది. నిధుల్లేక నీటిపారుదల శాఖాధికారులు జలాశయాల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో వీటి పరిధిలోని ఆయకట్టుకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో జలాశయాల కిందవున్న ఆయకట్టుల్లో ఉడుపులు కాలేదు. గతేడాది వలె జలాశయాల్లో నీటి నిల్వలు లేనప్పటికీ, ఉన్న నీటిని సరఫరా చేయగలిగిన పరిస్థితిలో నీటిపారుదలశాఖ లేదు.

ఆగస్టు 2న పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాలు, 10న తాండవ జలాశయ నీటిని వదిలినప్పటికీ వీటి కింద సగం విస్తీర్ణంలో కూడా వరి పంట సాగుకాలేదు. పెద్దేరు కుడికాలువ తుప్పలు, డొంకలు పట్టివుంది. విడిచి పెట్టిన నీరు కిందికి వెళ్లక కాలువకు ఆనుకొని వున్న భూముల్లో దమ్ములుకాలేదు. దమ్ము చేసిన పొలాలకు నీరులేక పగుళ్లుదేరి కనిపిస్తున్నాయి. జిల్లాలోని తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల కింద 75,414 ఎకరాల ఆయకట్టు వుంది. దీంట్లో ఆగస్టు 31 నాటికి 19,341 (26 శాతం) ఎకరాల్లో వరి సాగైంది. సెప్టెంబరు 2 నాటికి 30,171 ఎకరాల్లో (40 శాతం) వరి పంట వేసినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పెద్దేరు కుడికాలువ నీరు రాకపోవడంతో రావికమతం మండలం కవ్వగుంటకు సమీపంలోని చింతమానుపాలెం ఎండిపోయింది. దమ్ము పట్టేందుకు నీరులేకపోవడంతో రైతులు పశువులు మేపుకుంటున్నారు. కవ్వగుంటకు ఆనుకొని కుడికాలువ కిందవున్న భూమికి నీరురాక మహిళలు బకెట్లతో పొలం తడుపుతుంటే, సీమునిరి రాము అనే రైతు ఉడిసేందుకు 36 సెంట్లు మడి సిద్ధం చేయడం కనిపించింది. రాము మడికి ఎగువన వున్న ఆకు మడి ఎండిపోయింది. మరికొంత మంది రైతులు మోటార్లు పెట్టుకొని దమ్ములు చేస్తున్నారు. మోటార్ నీటితో దమ్ముచేసిన ఉరికిడి తాతబాబుకు చెందిన రెండెకరాల వరి పొలం పగుళ్లుదేరుతోంది.

తాండవ మెయిన్‌గేట్ లీకేజీలను శాశ్వతంగా అరికట్టేందుకు రూ.7.50 లక్షల విలువైన పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. నీరు వృథాగా పోతోంది. ఆయకట్టుకు నీటి సమస్య ఏర్పడుతోంది.

జిల్లాలో సెప్టెంబరు 2 నాటికి జలాశయాల వారీగా ఆయకట్టు, సాగైన వరి పంట వివరాలు (ఎకరాల్లో)

జలాశయం	ఆయకట్టు	వరిసాగు	శాతం
తాండవ	32,689	11,250	34.12
పెద్దేరు	15,105	6,207	41.09
రైవాడ	15,344	6,464	42.13
కోనాం	12,276	6,250	50.91

నిరుద్యోగ సమస్యపై సిపిఎం ర్యాలీలు

అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి పాలకులు ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. మతోన్మాద మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్స్, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని లోకనాథం తెలిపారు. అగ్నిపథ్ పేరుతో నాలుగు సంవత్సరాల కాంట్రాక్ట్ ఉద్యోగాలకు తెర లేపి యువతను మోసం చేయడంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ ఎక్కడా అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, నాయకులు సిహెచ్.శివాజీ, ఎస్.నాగరమణ, జి.సురేష్, కె.సుజాత, చలపతి, నూకఅప్పారావు, తరుణ్ పాల్గొన్నారు.

విశాఖ నగరంలో..

ఆదివారం సాయంత్రం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సరస్వతీ పార్కు నుంచి డాబాగార్డెన్స్, ఆర్టీసి కాంప్లెక్స్ మీదుగా లలిత జ్యూయలరీ వరకు నిరుద్యోగ యువతీ, యువకులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యుఎస్ఎన్.రాజు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. దేశంలో ఉపాధి కల్పనలో ప్రభుత్వరంగ పరిశ్రమలు కీలకమైన పాత్ర పోషిస్తుంటే వాటిని గుండగుత్తగా మోడీ, జగన్ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా అమ్మేస్తున్నారని దుయ్యబట్టారు. మోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే, రక్షణ రంగం, పోర్టులను అమ్మేస్తుంటే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది తప్ప వాటిని రక్షించుకునే ప్రయత్నం చేయకపోవడం శోచనీయమన్నారు. కేరళలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలను మోడీ సర్కారు అమ్మేస్తే వాటిని ఆ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం స్వాధీనం చేసుకొని లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ విధానాల వల్ల నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోయిందన్నారు.సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, హెచ్‌పిసిఎల్ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు ఉన్నప్పటికీ పర్మినెంట్ ఉద్యోగాలు తీయకుండా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగాలు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులకు లాభాలు చేకూర్చుతున్నారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.సంతోష్, ఐద్వా రాష్ట్ర నాయకులు బి.పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, సిఐటియు జిల్లా కార్యదర్శి యు.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు గణేష్, విజయ, శ్రావణ్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

విద్యుత్ అవాంతరాల నివారణకు చర్యలు

కమిషన్ నిర్దేశించిన జరిమానా ఛార్జీలు విధించబడతాయన్నారు. ప్రతిరోజూ విద్యుత్ సరఫరా తీరును సమీక్షించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఫలితాల దిశగా ఇంటింటికీ రేషన్

విశాఖ జిల్లాలో 5.35 లక్షల కార్డులకు సరఫరా

పట్టణ ప్రాంతాల జాబితాలోకి కొత్తగా గోధుమ పిండి

'ప్రజాశక్తి'తో జిల్లా పౌరసరఫరా అధికారి జి సూర్యప్రకాశరావు



ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకప్పుడు గంటల తరబడి క్యూ లైన్లలో రేషన్ షాపు వద్ద నిల్చొనే పద్ధతి నుంచి నెలయ్యే సరికి వాహనాల్లో ఒక చోటకు రేషన్ సరుకులన్నింటినీ తెచ్చే విధానంపై వివిధ తరగతులకు చెందిన ప్రజలు కాసింత సంతృప్తినే వ్యక్తం చేస్తున్నారని విశాఖ జిల్లా పౌర సరఫరా అధికారి జి.సూర్యప్రకాశరావు అన్నారు. గతంలో సరుకులు తెచ్చుకోవడానికుండే చాలా సమస్యలు ఇప్పుడు కానరావడం లేదన్నారు. సరుకుల ధరలు మార్కెట్‌లో పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో రేషన్ ద్వారా లభించే వస్తువుల సంఖ్య పెంచితే బాగుండేదనే అభిప్రాయం రావడంతో గోధుమ పిండిని కూడా పట్టణాల్లో సరఫరా చేస్తున్నామని అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన ముచ్చటిస్తూ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులు ఇచ్చే పద్ధతి ఎలా ఉంది ?

విశాఖ జిల్లాలో 310 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ ద్వారా తెల్ల రేషన్ కార్డులు 5,09,426, అంత్యోదయ అన్నయోజన (ఎఎవై) కార్డులు 12,020 కలిపి 5,21,446 రేషన్ కార్డులకు సరుకుల పంపిణీ జరుగుతోంది. ఇవి కాకుండా ఇటీవల కొత్తగా మంజూరైన 5014 కార్డులకు ఎండియుల ద్వారా ఇంటింటికీ రేషన్ విధానాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు అమలు చేస్తున్నారు. నెలకు ఫోర్టిఫైడ్ బియ్యం (రైస్) 8,180 టన్నులు, పంచదార 266 టన్నులు, కందిపప్పు 521 టన్నులు సరఫరా అవుతోంది. గోధుమ పిండి అర్బన్ ప్రాంతాల్లో మామూలు కార్డులు 4,79,221కు కిలో చొప్పున రూ.16 తీసుకుంటూ సరఫరా చేస్తున్నాం. ఎఎవై కార్డులకు కిలో సుగర్ కేవలం రూ.13కు, అరకేజీ సుగర్ మామూలు కార్డుదారులకు రూ.17లకు ప్రభుత్వం రేషన్ ద్వారా



అందిస్తోంది. ఎఎవై కార్డు దారులు అత్యంత నిరుపేదలైనందున వారికి తక్కువ ధరకు పంచదారను సరఫరా చేస్తున్నారు.

కొత్తగా ఇచ్చే సరుకుల వివరాలు తెలపగలరా ?

రేషన్ సరుకుల్లో ప్రభుత్వం గోధుమ పిండిని చేర్చింది. సరుకులు అందరికీ అందేలా మా సిబ్బంది నిఘా, పర్యవేక్షణ నిత్యం ఉంటాయి. కొత్తగా మంజూరైన 5014 కార్డుదారులకూ సరుకులను అందజేస్తున్నాం.

ఫోర్టిఫైడ్ బియ్యం సంగతేంటి ?

2022 జులై నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు సరఫరా చేస్తోంది. వీటిని ప్లాస్టిక్ బియ్యం అంటూ కొందరు ప్రచారం చేయస్తున్నారు. దీంతో అన్ని తరగతులకూ అవగాహన కల్పించి ఫోర్టిఫైడ్‌లో ఎలాంటి పోషకాలుంటాయో ప్రయోగాత్మకంగా రుజువైన అంశాలను వివరిస్తున్నాం. రేషన్ ద్వారా అందజేసే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఒకసారి కడిగిన తర్వాత నీళ్లలో 3 నుంచి 4 నిమిషాలు నానబెట్టిన తర్వాత ఉడకబెట్టడం వల్ల పోషకాలు అన్నంలో కలిసి ఆహార పదార్థం ఉపయోగకరంగా ఉంటుంది.

కలుషిత నీటి సమస్యపై విచారణ

ప్రజాశక్తి – కలెక్టరేట్ : కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిలో డ్రైనేజీ కలుషిత జలాలు కలుస్తున్నాయని, అందువల్ల రోగాల బారిన పడుతున్నామని 38వ వార్డు సోల్జర్ పేటకు చెందిన అంజు అనే మహిళ సౌత్ కంప్లైంట్ గ్రూపులో ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు చేసిన ప్రాంతాలకు వెళ్లి కుళాయిల్లో వస్తున్న నీటిని పరిశీలించారు. స్వచ్ఛమైన జలాలు వస్తున్నాయని, డ్రైనేజీ నీరు కలవడం లేదని అధికారులు గుర్తించి, ఆ ప్రాంత ప్రజల సమక్షంలో కుళాయి ద్వారా వచ్చిన నీటిని తాగి చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటితోపాటు ఏవైనా సమస్యలుంటే స్థానికులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జివిఎంసి వాటర్ వర్క్స్ విభాగం ఎఇ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణ, స్థానిక వైసిపి నాయకులు ఆదిల్, టేకి ప్రసాద్, చిన్ని కృష్ణ, రాజారెడ్డి, జివిఎంసి వాటర్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి – కలెక్టరేట్ : జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని శ్రీ స్వామి వివేకానంద సంస్థలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ముస్తాఫ్ అహ్మద్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి జెసిఐ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందజేశారు. జెసిఐ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జోన్ వైస్ ప్రెసిడెంట్ వి.రాజేష్ కుమార్, ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్ కెపి.కళ్యాణ్, డే కో – ఆర్డినేటర్ మోహిని, నానాజీ, రమ్య పాల్గొన్నారు. ఈ శిబిరంలో 200 మంది వైద్య సేవలు పొందారు. పోషకాహారలోపంగల పిల్లలకు స్వచ్ఛంద సంస్థ వారు పోషకాహారం అందజేశారు.

42వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : జివిఎంసి 42వ వార్డు శ్రీకన్య థియేటర్ వెనుక చాకలి వీధిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్ర ప్రజలను నయవంచనకు గురిచేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు కన్నం వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ఆకిరెడ్డి జగదీష్, ముప్పాళ్ల శ్రీకృష్ణ, దువ్వి గాలి ప్రసాద్, జనపాల కృష్ణ, వాకాడ తాతారావు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి – కలెక్టరేట్ : వైసిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పిలుపునిచ్చారు. దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ ఉరికిటి నారాయణరావు ఆధ్వర్యంలో వార్డు నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జిల్లా పరిషత్ వద్దగల స్టే ఇన్ కల్యాణ మండపంలో జరిగింది.

శిథిల భవనంలో చదువులు

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- తాగునీటి సమస్య తీవ్రం
- అవస్థలు పడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ తగరపువలస బంగ్లామెట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనాన్ని 1992 సెప్టెంబర్ 12న అప్పటి రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ మంత్రి గుడివాడ గురునాథరావు ప్రారంభించారు. రెండంతస్తుల భవనంలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 40 మంది ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అరకొర వసతుల నడుమ చదువులు సాగిస్తున్నారు. పైన ఉన్న 3 గదుల్లో రెండు గదులు, కింద ఉన్న రెండు గదుల్లో విద్యార్థులు ఉంటున్నారు. వంట గది, స్టోర్ రూం, వార్డెన్ రూం వినియోగంలో ఉన్నాయి. కిందన ఉన్న ఓ గది పెచ్చులూడి ఏనాడో కుప్ప కూలింది. దీంతో ఆ గదిని మూసేశారు.

స్నానపు గదులు, మరుగుదొడ్లు అధ్వానం

స్నానపు గదులు నాలుగు ఉన్నా మూడు పనిచేయడం లేదు. నాలుగు మరుగు దొడ్లలో రెండు పనిచేయడం లేదు. రెండు మరుగు దొడ్లనే 40 మంది వాడుతున్నారంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అరకొరగా స్నానపు గదులు ఉండడంతో హాస్టల్ ఆరుబయటే విద్యార్థులు స్నానం చేస్తున్నారు. ఆ ప్రాంతమంతా నిండా నాచుతో ఉంది. కాలువ ద్వారా నీరు వెళ్లే పరిస్థితి లేదు. మురుగు నీరు నిల్వ ఉండడంతో రాత్రి వేళ దోమలు ఎక్కువై కంటి మీద కునుకు ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి...

శిథిల భవనం పరిస్థితి సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. సాధ్యాసాధ్యాలు పరిశీలించి వీలుంటే అద్దె భవనంలోకి మార్చే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నారు.

బి.సత్యనారాయణ
హాస్టల్ వార్డెన్

తాగు నీరు కొని తెచ్చుకుంటున్నాం

రూమ్‌లో ఉన్న తమలో ఒక్కొక్కరు తలో రూ.10 వేసుకుని వాటర్ క్యాన్ కొని తెచ్చుకుంటున్నాం. నిద్రించే సమయంలో గది పై కప్పు పెచ్చులు ఏ క్షణాన పడిపోతాయో అన్న భయం నిత్యం తమను వెంటాడుతోంది.



ఎం.విజయ్‌కుమార్
బిటెక్, ఫైనల్ ఇయర్

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : రుషికొండ గీతం ఆసుపత్రి ఆధ్వర్యాన సోమవారం ఉదయం 11 గంటల నుంచి గంట స్తంభం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించు కో వాలని స్థానికులను కోరారు.

నకిలీ వెబ్ సైట్లపై అప్రమత్తం

ప్రజాశక్తి -మధురవాడ : ఆన్‌లైన్‌లో విలువైన వస్తువులను తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు పేజ్ జాకింగ్ పద్ధతి ద్వారా సృష్టిస్తున్న నకిలీ ఈ కామర్స్ వెబ్-సైట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ సైబర్ క్రైమ్ సిఐ కె.భవానీప్రసాద్ హెచ్చరించారు. పెళ్లిళ్ల సీజన్, శ్రావణ మాస సేల్, పండగలు ఇతర వేడుకల సందర్భంగా సైబర్ నేరగాళ్లు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, డిమార్ట్, బిగ్ బాస్కెట్, బిగ్ బజార్ వంటి కంపెనీల వెబ్ సైట్లను పోలిఉండే నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి వస్తువులపై భారీ డిస్కౌంట్లు అంటూ సోషల్ మీడియా వెబ్ సైట్‌లలో ప్రచారం చేస్తూ ఆకర్షిస్తారని, అతి తక్కువ ధరకు మంచి వస్తువు దొరుకుతుందన్న ఆశతో వినియోగదారులు షాపింగ్ చేస్తూ మోసపోతున్నారని తెలిపారు. చెల్లింపు విషయంలో వినియోగదారుల వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డు సమాచారాన్ని పొంది వాటి ద్వారా ఖాతాల నుంచి డబ్బు దోచుకుంటున్నారని వివరించారు. ఆన్‌లైన్ వెబ్ సైట్ల షాపింగ్ చేసేవారు నకిలీ, అసలు ఈకామర్స్ వెబ్‌సైట్ల మధ్య ఉన్న తేడాను గుర్తించాలన్నారు. వెబ్సైట్‌లో మీవ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని షేర్ చేసేటప్పుడు మీరు జాగ్రత్తలు పాటించాలన్నారు. నకిలీలు పేరులను కొద్దిగా మార్పు చేసి ఉదారణకు అమెజాన్.కమ్ బదులు అమెజాన్. ఓఆర్జీ ద్వారా చీట్ చేసే ఛాన్స్ ఉంటుందని పేర్కొన్నారు. సైట్ యుఆర్ఎల్ తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా ఈ విధంగా మోసపోతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విశాఖపట్నం పోలీస్ సైబర్ క్రైమ్ స్టేషన్ ఫోన్ నెంబర్లను 9490617917, 9490617916, ఆర్థిక నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీడిత ప్రజల గొంతు గద్దర్



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-తగరపువలస: తాడిత, పీడిత ప్రజల గొంతు ప్రజా గాయకులు గద్దర్ అని పలువురు కళాకారులు, వామ పక్ష నాయకులు కొనియాడారు. స్థానిక సిఐటియు కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆయన పాడిన ప్రతి పాటా సమ సమాజ స్థాపన కోసమేనని పేర్కొన్నారు. కారంచేడు దారుణ ఘటన పైనా, అమెరికా సామ్రాజ్యవాదం పైనా, ఉత్తరాంధ్ర వెనుకబాటు తనంపైనా ఆయన ఎన్నో పాటలు రాసి పాడారని పేర్కొంటూ పాటల తూటా బహుజన కళా మండలి రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ భాస్కర్ సభలో పాటలు పాడి వినిపించారు. ఈ సభలో సిపిఎం, సిపిఐ నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, అల్లు బాబూరావు, కె.రాంబాబు, సిఐటియు నాయకులు నీలాతి రాము, ఉత్తరాంధ్ర కళాకారుల పౌరాణిక నాటక రంగ ఉపాధ్యక్షులు ఉప్పాడ అప్పారావు, కళాకారులు రామకృష్ణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కేసును నీరుగారుస్తున్నారంటూ..

మాజీ సైనికుల ఆందోళన

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో సుమారు 12 రోజుల క్రితం మాజీ సైనికుడు ఎం.ఆదినారాయణపై జరిగిన హత్యాయత్నం కేసును స్థానిక సిఐ నీరుగారుస్తున్నారంటూ మాజీ సైనికులు ఆరోపించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మాజీ సైనికుల వైస్ ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యాన ఆదివారం స్టేషన్ ఎదుట 60 మంది మాజీ సైనికులు ఆందోళన చేశారు. సిఐ ఎం.సన్యాసినాయుడును నిలదీశారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేశ రక్షకులుగా పనిచేసిన మేము శాంతియుతంగా పనులు జరగాలనే ఉద్దేశంతో స్థానిక పోలీసులపై ఎటువంటి ఒత్తిడి తీసుకురాకుండా ఇప్పటివరకు ఉన్నామన్నారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా దేశ స్థాయిలో మాజీ సైనిక సంఘాలతో చర్చించి తదుపరి చర్యకు దిగుతామని స్పష్టంచేశారు. కేసులో పురోగతి లేకుంటే భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామన్నారు. దేశ రక్షకులుగా పనిచేసిన తమకే అన్యాయం జరిగినప్పుడు సామాన్యులకు న్యాయం ఎక్కడ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో భూ అక్రమాలు, భూ సమస్యలపై పోరాటం చేస్తున్న మాజీ సైనికుడు ఆదినారాయణపై అధికారులు, అధికార పార్టీకి చెందిన సర్పంచ్ కుమారుడు కోన రమణ దాడికి పాల్పడడం విచారకరమన్నారు. దీనిపై సిఐ సన్యాసినాయుడును వివరణ కోరగా కేసు నమోదైందని, ఉన్నతాధికారుల సూచనలు మేరకే విచారణ సాగుతుందని తెలిపారు.



పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ సైనికులు

నేరాలు ఘోరాలు

వోల్వో బస్సు ఢీకొని విశ్రాంత ఆర్‌టిసి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-పాయకరావుపేట: పట్టణంలోని గాంధీ నామవరం జంక్షన్ వద్ద వాల్వో బస్సు ఢీ కొని విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. విశ్రాంత ఆర్‌టిసి డ్రైవర్ ఎర్ర వీర వెంకట సుబ్బారావు నామవరంలో మటన్ దుకాణానికి బైక్‌పై తన మనుమడు ఎర్ర సుహానితో కలిసి వెళుతున్నాడు. ఈ రోడ్డులో బైక్ యు టర్న్ తిరుగుతుండగా వోల్వో బస్ ఢీ కొంది. దీంతో, సంఘటనా స్థలంలో ఎర్ర వీర వెంకట సుబ్బారావు మృతి చెందాడు. బైక్ వెనుక ఉన్న మనుమడు ఎర్ర సుహానికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితుడిని మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఆదివారం సీఐ అప్పన్న, ఎస్సై శిరీష ఆధ్వర్యంలో పోలీసులు చందనాడ సమీపంలో జీడిమామిడి తోటలో కోడిపందేల శిబిరంపై దాడి చేసారు. ఈ దాడుల్లో 17 మందిని అరెస్టు చేసి ,వారి వద్ద నుండి 10 కోళ్లు, 13200 నగదు, 12 బైక్‌లను స్వాధీన పలుచుకున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి-.అనకాపల్లి : మండలంలోని కొప్పాక జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్సై నర్సింగరావు అందించిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం వాకపాడు గ్రామానికి చెందిన గొన్నబత్తుల ఆదినారాయణ (30) తన ద్విచక్ర వాహనంపై అనకాపల్లి నుంచి విశాఖపట్నం వైపు వెళ్తుండగా వెనకనుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-చోడవరం: చోడవరం పట్టణం అన్నవరానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థినిని లైంగికంగా వేధిస్తున్న చోడవరానికి చెందిన వేచలపు గంగాధర్ అనే వ్యక్తిని ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసామని స్థానిక సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరుపరచగా చోడవరం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు. దీంతో గంగాధర్‌ను సబ్ జైలుకు తరలించమన్నారు.

నిందితున్ని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-చోడవరం : బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న డిమాండ్ చేసారు. పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసిన నిందితుడికి బెయిల్ రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుడిని బెయిల్ ఇచ్చి బయటకు వదిలేయడం వల్ల బాధితులను ప్రలోభపెట్టడం, ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న భువనేశ్వరి

పేదలకు దుప్పట్లు పంపిణీ


ప్రజాశక్తి-తగరపువలస: జివిఎంసి ఒకటో వార్డు జనసేన నాయకులు పరిమి భువనేశ్వరి తన సొంత నిధులతో సమకూర్చిన దుప్పట్లను సుమారు 30 మంది పేదలకు శనివారం రాత్రి పంపిణీ చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఆదర్శ నగర్‌లో ఆమె నివాసం వద్ద దుప్పట్లు అందజేశారు. దుప్పట్లు అందుకున్న వారిలో వికలాంగులు కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.



ధనరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ఘనంగా ధనరాజు వర్ధంతి

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం : స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులుగా పనిచేసి కార్మికుల మన్నన పొందిన నాయకుడు వంకా దనరాజు 11 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సిఐటియు నాయకులు మోహిద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధనరాజు చిత్రపటానికి సీనియర్ నాయకులు ఎస్ఎన్.మూర్తి, డిసిహెచ్ వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, రామస్వామి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటం తీవ్ర స్థాయిలో జరుగుతున్న సందర్భంలో ధనరాజు లాంటి నాయకులు లేకపోవడం తీరనిలోటు అన్నారు. ఏ సమస్యనైనా క్షుణ్ణంగా అధ్యయనం చేసి కార్యకర్తలను, కార్మికులను చైతన్యం చేయడంలో ధనరాజు పాత్ర కీలకమైనదని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కాపాడుకోవడం, కార్మిక హక్కులను రక్షించుకోవడం ధనరాజుకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌శేఖర్, కెఆర్‌కె.రాజు, పవన్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న జియ్యాని శ్రీధర్

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు కరాసకు చెందిన బేరి యశోద అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.30 వేల చెక్‌ను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆదివారం శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కు రావటం పట్ల బాధిత మహిళ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎందరో పేదల ఆరోగ్యాన్ని జగన్మోహన్‌రెడ్డి నిలబెడుతున్నారన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తును ప్రతిపాదించిన పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎయులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు రసాయనశాస్త్ర విభాగంలో 1984-86 సంవత్సరంలో పీజీ పూర్తిచేసిన పూర్వవిద్యార్థులు సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టులు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను అభివృద్ధి చేసి నేటి తరం విద్యార్థులకు చేరువ చేస్తున్న విధానంపై ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని పూర్వవిద్యార్థులకు వీసీ సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి స్వాగతం

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖకు విచ్చేసిన పోర్టులు, షిప్పింగ్, జలరవాణా, ఆయుష్ శాఖలకు చెందిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విమానాశ్రయంలో ఎపి బిజెపి ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు స్వాగతం పలికారు. వీరితోపాటు రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, బిజెపి నాయకులు మేడపాటి రవీంద్ర, కాశీ విశ్వనాథ్‌రాజు, విష్ణు కుమార్‌రాజు తదితరులు కేంద్రమంత్రికి స్వాగతం పలికారు.

గ్రంథాలయాలకు తగ్గిన వార్షిక బడ్జెట్

వార్తాపత్రికలకూ నిధులు కరువే...




ఆనందపురం గ్రంథాలయం

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రంథాలయ సేవలను కుదించి వార్షిక బడ్జెట్‌ను తగ్గిస్తున్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ గ్రంథాలయం ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాలలో వివిధ పుస్తకాలతో పాటు రోజూ వార్తాపత్రికలు అందుబాటులో ఉండేవి. వీటి కోసం ఏడాదికి రూ.36 వేలు బడ్జెట్ కేటాయించేవారు. ప్రస్తుతం బడ్జెట్‌ను రూ.23 వేలకు కుదించినట్లు గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రధాన పత్రికలను మాత్రమే గ్రంథాలయాలలో వేయిస్తున్నారు. మిగిలిన పత్రికలలో వచ్చే వార్తలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. పోటీ ప్రపంచంలో ప్రధాన పత్రికలు రాజకీయ లబ్ధి కోసమే వార్తా కథనాలు ప్రచురించగా ప్రజా సమస్యలపై పనిచేసే పలు పత్రికల సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి పెట్టి అన్ని పత్రికలను సామాన్యులకు అందుబాటులో ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి, అడవివరంలో గ్రంథాలయాలు ఉన్నాయి. కొన్నిచోట్ల గ్రంథాలయ భవనాలు మరమ్మత్తులకు గురయ్యాయి. వాటిల్లోనే గ్రంథాలయాలను నడుపుతున్నారు. గ్రంథాలయాల వార్షిక బడ్జెట్‌ను తగ్గించడంతో కాలక్రమంలో పూర్తిగా ఎత్తివేస్తారేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయ సేవలు నిర్వీర్యం

గ్రంథాలయాలకు వార్షిక బడ్జెట్ తగ్గించడం ద్వారా వాటి సేవలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. తాజా చర్యలతో ముమ్ముందు గ్రంథాలయాలు పూర్తిగా ఎత్తివేస్తారేమోనని అనుమానం కలుగుతోంది. గ్రంథాలయాలను అభివృద్ధి చేసి ప్రజలకు సేవలందించాలి.



వడ్డి అబ్బాయి, రిటైర్డ్ అధికారి, గ్రంథాలయ పాఠకుడు, ఆనందపురం

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి

సిఐటియు

ప్రజాశక్తి -గాజువాక : వీధి వ్యాపారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు నాయకులు కెవి.రమణ, వై.లక్ష్మణరావు డిమాండ్‌చేశారు. కొత్త గాజువాకలో ఆదివారం జరిగిన సభలో వారు మాట్లాడుతూ, గాజువాక వీధుల్లో గంపలు అమ్ముకునేవారు, రోడ్లపై తోపుడు బండ్లు, ఫుట్ పాత్‌పై దుకాణాలు నిర్వహించేవారు సుమారు పదివేల మంది వరకు ఉన్నారని తెలిపారు. వీరికి జివిఎంసి నుంచి ఎటువంటి గుర్తింపు కార్డులూ ఇవ్వలేదని పేర్కొన్నారు. 2017లో కొందరికి ఇచ్చినా వాటికి 2018తో గడువు ముగిసిందన్నారు. తరువాత ఇప్పటివరకు కొత్తగా సర్వే చేయడం గానీ, గుర్తింపు కార్డులు ఇవ్వడం గానీ చేయలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న పథకాల్లో వీధి విక్రయిదారులకు లబ్ధి చేకూరాలంటే గుర్తింపు కార్డు ముఖ్యం అని పేర్కొన్నారు.



సభకు హాజరైన వీధి వర్తకులు

మరోపక్క వీధులలో విక్రయాలు జరిపేటప్పుడు కొంతమంది అధికారులు, స్థానిక బ్రోకర్లు వీరిని వేధిస్తున్నారని, వెంటనే వీధి విక్రయిదారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు.

గ్లకోమాను ముందస్తుగా గుర్తించాలి



సదస్సుకు హాజరైన కంటి ఆసుపత్రుల ప్రముఖులు

ప్రజాశక్తి-వేపగుంట : గ్లకోమా వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ ఆప్తాలమిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జిఆర్.రెడ్డి పేర్కొన్నారు. విశాఖ ఆప్తాలమిక్ అసోసియేషన్, గ్లకోమా సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌లో ఆదివారం 'గ్లకోమా ఇండియా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ఈ సదస్సుకు శంకర్ ఫౌండేషన్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి, డాక్టర్ అగర్వాల్స్, గీతం మెడికల్ కాలేజ్, విశాఖ కంటి ఆసుపత్రుల నుంచి 160 మంది వైద్యులు హాజరయ్యారు. ఈ సదస్సులో డాక్టర్ జిఆర్.రెడ్డి మాట్లాడుతూ, గ్లకోమా కోలుకోలేని అంధత్వ వ్యాధి అన్నారు. రోగికి కంటి నొప్పి, కంటి నుంచి నీరు కారడం, ఎరుపు రంగు లేకపోయినా నిశ్శబ్దంగా పరిధీయ దృష్టిని గ్లకోమా చంపేస్తుందని పేర్కొన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, అధిక మయోపియా, గ్లకోమా కుటుంబ చరిత్ర కలిగిన వారు తరచుగా నేత్ర వైద్యుడిని సంప్రదించాలన్నారు.

గౌరవ అతిథి, విశాఖపట్నం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర సదస్సు నుంచి జ్ఞానాన్ని పొందాలని పిలుపునిచ్చారు. గ్లకోమా చికిత్సకు క్లినికల్ ఎగ్జామినేషన్, ఫాలోఅప్ చాలా కీలకమని పేర్కొన్నారు. కంటిలో అధిక పీడనం భారీగా పెరగడం వల్ల గ్లకోమా వ్యాధికి దారితీస్తుందని తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి విజయకుమార్ మాట్లాడుతూ, శంకర్ ఫౌండేషన్‌లోని సౌకర్యాలను పరిశోధన కార్యకలాపాలకు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, ప్రీమియర్ ఐ కేర్ సర్జికల్ సెంటర్ డాక్టర్ ఎన్ఆర్ రంగరాజ్, డాక్టర్ శిరీష, డాక్టర్ టి.రవీంద్ర, డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ కెవివి.సత్యనారాయణ, డాక్టర్ ఎన్ మల్లీశ్వరి, శంకర్ ఫౌండేషన్ మెడికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నస్రిన్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సుపర్ణ పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే వైరస్‌ల వ్యాప్తి నియంత్రణ

ప్రజాశక్తి-విశాఖపట్నం: కరోనా వైరస్‌ల వ్యాప్తి ఒక దేశం నుంచి మరో దేశానికి విస్తరించకుండా ఉండాలంటే ప్రాథమిక దశలోనే గుర్తించి అంతర్జాతీయ ఆరోగ్య నియంత్రణ సూత్రాలను విధిగా అమలు చేయాలని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం ఏర్ పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్ అధిపతి డాక్టర్.ఎమ్.అనురాధ పేర్కొన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) సామాజిక వైద్యవిభాగం ఆధ్వర్యాన ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ 28వ వార్షిక సమావేశాలలో ఆదివారం ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన అంతర్జాతీయ ఆరోగ్య నియంత్రణలను పూర్తి స్థాయిలో కేవలం 64 దేశాలు మాత్రమే అమలు చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో వైరస్‌ల వల్ల ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరగకుండా ఉండాలంటే వైద్య ఆరోగ్య రంగంలో ప్రపంచ దేశాల మధ్య సహకారం, సామాజిక వైద్య నిపుణుల అప్రమత్తత అవసరమని చెప్పారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) టిబి.నియంత్రణ ప్రాజెక్టు సాంకేతిక సలహాదారు డాక్టర్ ఎమ్.విజ్ఞేష్ మాట్లాడుతూ, 2025 నాటికి దేశంలో టిబి.వ్యాధిని పూర్తిగా నియంత్రించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. జాతీయ స్థాయి వ్యాధుల నియంత్రణ విభాగం వన్ హెల్త్ ప్రాజెక్టు డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ అజిత్ డి.షెహ్వాలే మాట్లాడుతూ, పాము కాటుకు గురై మరణిస్తున్న వారి సంఖ్య దేశంలో ఏటా 48 వేలకు పైగా కేసులు నమోదవుతున్నాయని, ఈ కారణంగా పాము కాటు మందు ఎఎస్‌విఎస్ ను అత్యవసర ఔషధాల జాబితాలో ప్రభుత్వం చేర్చడంతో పాటు ప్రత్యేక జాతీయ విధానం రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి పద్మజ, సమావేశాల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎన్‌జి.నాగమణి, సంయుక్త కారదర్శి డాక్టర్ జి.చైతన్య, ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అప్పలనాయుడు, కార్యదర్శి పిజె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న గీతం ప్రతినిధులు

ఉత్తమ ఆచార్యులుగా ఎయు నుంచి ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఆచార్యుల పురస్కారానికి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఆరుగురు ఆచార్యులు ఎంపికయ్యారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల నుంచి ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల నుంచి ఆచార్య పి.శ్యామల, ఆచార్య సివి.నాయుడు, న్యాయ కళాశాల నుంచి ఆచార్య కె.సీతామాణిక్యం, ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలితభాస్కరి ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన ఏయూ స్నాతకోత్సవ మందిరం వేదికగా జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరు పురస్కారాలను అందుకోనున్నారు. ఈ సంవత్సరం పురస్కారాలు స్వీకరిస్తున్న వారిలో నలుగురు మహిళలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికైన ఆచార్యులను వర్సిటీ అధికారులు, ఆచార్యులు అభినందించారు.

జీవాల పెంపకందారులకు న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న జీవాల పెంపకందారులు

ప్రజాశక్తి- కశింకోట: గొర్రెలు, మేకలు పెంపకందారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, ఆదివారం త్యాగాడ గ్రామ యాదవ్ సంక్షేమ సంఘం నాయకులు ధర్నా చేశారు, తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మూడురోజులుగా పెంపకందారులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా త్యాగాడ మాజీ సర్పంచ్ సర్వసిద్ధి తాతారావు మాట్లాడుతూ, త్యాగాడ గ్రామంలో 103 సర్వే నెంబర్లోని 33 ఎకరాల భూమి పూర్వీకులు నుండి గొర్రెలు, మేకలు పెంపకందారులు ఆధీనంలో ఉందని, స్థానికులు కబ్జా చేయడానికి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవాల పెంపకమే జీవనాధారంగా ఉన్న 52 కుటుంబాలకు ఈ భూమి చెందే విధంగా రెవెన్యూ అధికారులు చూడాలని, తక్షణమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తరాలుగా వస్తున్న భూమి ఇతరులకు కేటాయిస్తే సహించేది లేదని, అవసరమైతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనిపై సోమవారం కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం అందజేస్తామన్నారు. ధర్నాలో పల్లా వెంకీ నాయుడు, సర్వసిద్ధి తాతాజీ, చందక నాగేష్, కుండలు శ్రీనివాసరావు, కుండలు బాబూరావు, పక్కుర్తి సత్యం పాల్గొన్నారు

నవోదయకు 'పిఎంఎన్' విద్యార్థి



కొప్పాక కుమారసాయి

ప్రజాశక్తి -వడ్డాది : వడ్డాది పిఎమ్ఎన్ మోడల్ స్కూల్ విద్యార్థి కొప్పాక కుమారసాయి నవోదయ పాఠశాలలో తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడు. రావికమతం మండలం మేడివాడకు చెందిన కొప్పాక కుమారసాయి పిఎంఎన్ మోడల్ స్కూల్లో గత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదివాడు. గత ఏప్రిల్ నెలలో జరిగిన నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్ష రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాలలో కుమారసాయి ఉత్తమ ప్రతిభ కనబరిచి నవోదయకు ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ పి రమణ,ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఇప్పటికే నవోదయపాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షల్లో ఈ పాఠశాల నుండి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు నవోదయకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, అందుకే పలువురు ప్రవేశపరీక్షల్లో సత్తా చాటారని ప్రిన్సిపల్ పి రమణ తెలిపారు.

వికలాంగులకు వీల్‌చైర్లు పంపిణీ



వికలాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న భాస్కరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పరుచూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ముందుగా బైపాస్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేశారు. అనంతరం వికలాంగులకు వీల్ చైర్లు పంపిణి చేశారు. బవులవాడ గ్రామంలో పూర్తిగా నడవలేని పరిస్థితిలో ఉన్న బాలికకు స్వయంగా ఇంటికి వెళ్లి వీల్‌చైర్‌ను అందజేశారు అనకాపల్లి పట్టణం గాంధీనగర్‌లోని బిసి హాస్టల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం గుండాల వీధిలోని ప్రభుత్వ బాలికల హాస్టల్లో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. జనసేన నాయకులు పల్లెల గణేష్, గంజి సత్యారావు, పావాడ కామరాజు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండ

ప్రజాశక్తి- కె.కోటపాడు: అనాథాశ్రమ పిల్లలను ఆదుకొనుటకు జనసేన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందనిఆ పార్టీ మండల నాయకులు ఉగ్గిన త్రినాథ్, చౌడువాడ నేతలు రాజి నారాయణమూర్తి. కుంచ మణికంఠ అన్నారు. జనసేనాని పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని చౌడువాడ శివారు పాచిలవాని పాలెంలోని అనాథాశ్రమంలోని పిల్లలకు భోజనం సమకూర్చారు. కుంచ మణికంఠ, రాజి నారాయణమూర్తి, బాలిబోయిన సంతోష్ సమకూర్చిన విద్యా సామగ్రిని త్రినాథ్ అందజేశారు. 35 మంది చిన్నారులను చేరదీసి వారి ఆలనాపాలనా చూస్తున్న ఆశ్రమనిర్వాహకులను అభినందించారు.గొంగుమళ్ల భీమేష్. మహేష్, నగేష్, జి అప్పల రాజు, సురేష్, ప్రదీప్, అజిత్,కల్యాణం, నాగరాజు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌ను కలిసిన తూర్పుకాపు నేతలు



ఎంవిఆర్ ను కలిసిన తూర్పు కాపు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : తూర్పు కాపు సంఘం జిల్లా నూతన కార్యవర్గం నేతలు ఆదివారం నరసింగరావు పేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ను మర్యాద పూర్వకంగా కలిసారు. ముత్యాల సతీష్(సంజూబాబు) ఆధ్వర్యంలో సమావేశంలో ప్రతిఒక్కరూ ఎంవిఆర్‌ను పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి ఎంవిఆర్, సతీష్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంవిఆర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తనను కలిసేందుకు తూర్పుకాపు సామాజికవర్గం నేతలు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సామాజిక వర్గీయులంతో ఎంతో నమ్మకంతో మిమ్మల్ని ఎన్నుకున్నారని, దానిని నిలబెట్టుకోవాలని కోరారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎంవిఆర్ ట్రస్ట్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసానిచ్చారు. తూర్పుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు కరణం శ్రీహరి(లాయర్), ఉపాధ్యక్షులు ఎస్ నానాజీ, కార్యదర్శి గొంతిన హరిబాబు, కోశాధికారి వెలగా అప్పారావు, సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్, ఉప కోశాధికారి ఉగ్గిన రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ వి శ్రీనివాసరావు, యువజన విభాగం అధ్యక్షులు నిమ్మదాల సురేష్ రంగా,కార్యదర్శి ఆకుల వెంకటేష్, ఉపాధ్యక్షుడు గల్లా గణేష్, ముఖ్య సలహా దారు అడపా శేషగిరిరావులను ఎంవిఆర్ దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంవిఆర్ పర్సనల్ అసిస్టెంట్ సతీష్ కుమార్ టస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ధర్మశ్రీ



వార్డు సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం శివాలయం వార్డులో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం పర్యటించారు. స్థానికులతో సమావేశమై, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు ధర్మశ్రీ దృష్టికి తెచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రజలు విన్నవించిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, న్యాయవాది నర్సింగరావు, వైసిపి నాయకులు బండి శ్రీను, ఓరుగంటి నెహ్రూ, ప్రకాశరావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రైతుల సంక్షేమానికి పెద్దపీట



సదస్సులో మాట్లాడుతున్న నూకరాజు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: పాడిరైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, అమూల్ డెయిరీ అందిస్తున్న సేవలను అందింపుచ్చుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. ఆదివారం. మండలంలోని వాడ్రాపల్లి సచివాలయంలో జగనన్న పాలవెల్లువ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పాడిరైతుల సంక్షేమాన్ని కాంక్షించి, అమూల్ డెయిరీతో సిఎం జగన్ ఒప్పందం చేసుకున్నారన్నారు. ఇతర డెయిరీల కంటే అధిక రేటును అమూల్ పాలకేంద్రాలకు పాలుపోసే రైతులకు అందిస్తున్నామన్నారు. అమూల్ డెయిరీ సభ్యరైతులకు రుణ సదుపాయం కల్పిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో అమూల్ డెయిరీ లైన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, అసిస్టెంట్ సిఇఒ పెంటకోట మహేష్, డ్వాక్రా సిఎనాగమణి పాల్గొన్నారు.

పాడి రైతులకు 'హెరిటేజ్' బోనస్



బోనస్ అందజేస్తున్న హెరిటేజ్ డెయిరీ మేనేజర్

ప్రజాశక్తి- అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో మడుతూరు శివారు ఏరికి రెడ్డిపాలెంలో గ్రామంలో ఆదివారం 32 మంది పాడి రైతులకు రూ.1,65 లక్షల బోనస్‌ను డెయిరీ మేనేజర్ కె శేషు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ పాడిపశువులకు కృత్రిమ గర్భాగరణ ఇంజిక్షన్లను హెయిటేజ్ డెయిరీ సౌజన్యంతో రూ.50కే అందిస్తామని, అదే మేలుజాతి ఆడ దూడ పుట్టాలంటే రూ.500 చెల్లించి ఇంజిక్షన్ వేయించాలని సూచించారు. పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. డెయిరీ సభ్యరైతు ప్రమాదవశాత్తుమరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి రూ.50వేలు బీమా పరిహారం సంబంధిత రైతుకుటుంబానికి అందుతుందన్నారు. కార్యక్రమంలో అప్పలరాజు, పెంటారావు, అప్పారావు, రమణమ్మ,వరలక్ష్మి నర్సింగరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలను వినియోగంలోకి తేరా?

- దాదాపు పూర్తయిన నిర్మాణాలు
- ఫినిషింగ్ పనులు చేపట్టక నిరుపయోగం
- అవస్థలు పడుతున్న లబ్ధిదారులు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు, నేతలు



అడ్డాంలో కిటికీలు, తలుపులేక ప్రారంభానికి నోచుకోని భవనం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో అంగన్వాడీ భవనాలు ప్రారంభించి వినియోగంలోకి తేవాలని అయా గ్రామస్తులు, అంగన్వాడీ లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు. భవనాల నిర్మాణాలు మొత్తం పూర్తిచేసి, కేవలం తలుపులు, కిటికీలు మాత్రమే వేయాల్సిన పరిస్థితుల్లో వీటిని పట్టించుకునే దిక్కులేక నిరుపయోగంగా ఉన్నాయి. అంగన్వాడీ లబ్ధిదారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నా కనీస స్పందన లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. బంగారయ్య పేట, అడ్డాం, కన్నూరుపాలెం, సుందరయ్య పేట, తీడ గ్రామాల్లో 2019లో గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ భవనాల నిర్మాణం చేశారు అయితే ఇప్పటి వరకు ఆ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. భవన నిర్మాణం పూర్తయినా, కేవలం తలుపులు కిటికీలు వేయాల్సి ఉంది. ఆ పనులు పూర్తి చేయక, వీటిని ప్రారంభించక ఇబ్బందులకు గురిచేయడంపై విమర్శలున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం, ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానికులు సమస్యను నేతల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే దుస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కార్యకర్తలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దుష్ట కీ తీసుకుని వెళ్ళవలసి ఉన్న ఐసిడిఎస్ పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవడం లేదు ని విమర్శలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా సంబంధిత ఐసిడిఎస్ అధికారులు ప్రభుత్వానికి విన్నవించా ప్రారంభం చేయాలని ఆయా గ్రామస్థులు గర్భిణీ స్త్రీలు, బాలింతలు కోరుతున్నారు

అద్దె భవనాల్లో నడుస్తున్న అద్దె గత నాలుగు సంవత్సరాలుగా ఎంత ప్రభుత్వం నగదు చెల్లింపుల చేసారో ఐసిడిఎస్ అధికారులు ను గ్రామస్థులు కోరుతున్నారు

ముఖ్యమంత్రిని కలిసిన ఎఎంసి ఛైర్మన్

ప్రజాశక్తి- అనకాపల్లి : విజయవాడలో ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు కుమారుడు వివాహ వేడుకలో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిని అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పలక యశోద రవి దంపతులు మర్యాద పూర్వకం గా కలిశారు. ముఖ్యమంత్రితో సెల్ఫీ దిగారు.



ముఖ్యమంత్రితో సెల్ఫీ దిగిన యశోద

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని మద్ది జంక్షన్లో శ్రీ సాగరదుర్గ ఆలయ నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ బి.సన్యాసమ్మ, ఆమె భర్త బి.సత్యనారాయణ శ్రీకారం చుట్టారు. సత్యనారాయణ మామ కనకల చిన్నమనాయుడు దంపతులు భూమి పూజ చేశారు. వీరితో పాటు ఎంపిపి రాంబాబు దంపతులు కూడా పాల్గొన్నారు.

తులసీ దళ అలంకరణలో నూకాంబిక

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలసిన నూకాంబికను శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు పుష్పాలు, తులసీదళాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు తగు ఏర్పాట్లు చేశారు

కెజిహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి -వడ్డాది : వడ్డాది గ్రామానికి చెందిన బంధం నూకాలు అనారోగ్యం కారణంగా విశాఖపట్నం కెజిహెచ్‌లో పది రోజులుగా చికిత్స పొందు తున్నాడు ఆసుపత్రిలో ఇన్ పేషెంట్‌గా చికిత్స పొందుతూ రాలేని స్థితిలో ఉన్న నూకాలుకు గ్రామ వాలంటీరు నాగమణి ఆసుపత్రికి తన సొంత రవాణా ఖర్చులతో వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. వాలంటీరు చొరవను పలువురు అభినందిస్తున్నారు.



ఆసుపత్రిలో లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న వాలంటీరు

పంటల ఎదుగుదలకు మీనామృతం



మీనామృతం తయారీపై రైతులు శిక్షణ ఇస్తున్న రామారావు

ప్రజాశక్తి -ఆనందపురం : పంటల ఎదుగుదలకు మీనామృతం అద్భుతంగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి రామారావు పేర్కొన్నారు. తర్లువాడ గ్రామంలో మీనామృతం తయారీపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులతో 40 కేజీలు మీనామృతం తయారీ చేయించారు. చేపల వ్యర్థాలు, సమానంగా బెల్లాన్ని తీసుకొని ఒక డ్రమ్ములో పొరలు పొరలుగా వెయ్యాలని, తర్వాత ఆ మిశ్రమాన్ని ఉదయం, సాయంత్రం ఒక కర్రతో కలపాలని తెలిపారు. ఈ మిశ్రమం 40 రోజుల తరువాత మీనామృతంగా తయారవుతుందన్నారు.

200 లీటర్ల నీటిలో 2 లీటర్ల మీనామృతం కలిపి ఆకుకూరలు, కూరగాయలు, వరి పంటకు పిచకారీ చేయాలని తెలిపారు. ఇది పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులకు ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నేచరల్ ఫార్మింగ్ అసోసియేట్ చక్రవర్తి, ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పైడిరాజు, రైతులు పాల్గొన్నారు

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి -వడ్డాది : కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు తెలిపారు. ఆదివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్ గ్రౌండ్‌లో సిఐటియు మండల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగనవాడి కార్యకర్తలను ఎఫ్ఆర్ఎస్ ట్యాబ్‌లతో మానసికంగా వేధిస్తున్నారన్నారు. ప్రతిరోజూ యాప్‌లో రెండుసార్లు వేలిముద్రలను నమోదు చేసుకుని, విధులు నిర్వహించాలని ఆశ కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. చాలీచాలని జీతాలతో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు జీవితాలను నెట్టుకొస్తున్నారని, వారిని ఇలా వేధింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. మున్సిపాలిటీ కార్మికులకు జీతాలు అందడం లేదన్నారు. అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతర పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

బుచ్చయ్యపేట మండల కమిటీ నూతన కార్యవర్గం

అనంతరం సిఐటియు బుచ్చయ్యపేట మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు నూతన కార్యవర్గం కన్వీనర్‌గా ఆర్ సోమనాయుడు, కో కన్వీనర్‌గా శ్రీరామమూర్తి, అంగనవాడి యూనియన్ లీడర్‌గా అమ్మాజీ, ఆశ నేత కృష్ణవేణి మధ్యాహ్నభోజన కార్మిక నేత ఉమామహేశ్వరి, భవన నిర్మాణ రంగం నుంచి భాస్కర్, విఆర్ఎ నుంచి శ్రీను, ముఠా కార్మికుల నుంచి సూరిబాబు, ఉపాధి హామీ పథకం నుండి బి రవణమ్మ, సచివాలయ సిబ్బంది నుంచి చంద్రరావులను కమిటీలో నియమించారు కార్మికుల సమస్య కోసం ఎల్లవేళలా పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ్ చంద్రశేఖర్, పినపాత్రుని సాంబశివరావు, రామలక్ష్మి, మంగలక్ష్మి, గూనూరు వరలక్ష్మి పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో నవ్య డ్యాన్స్ అకాడమీచే శాస్త్రీయ, జానపద నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాగతం స్వాగతం, మహా గణపతిం, స్వామి రారా, జయ జనార్ధన, శాంతాకారం, ముకుందా ముకుందా, ముద్దు గారే యశోద, కన్నా నిదురించరా తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి నవ్య నృత్య దర్శకత్వం వహించగా శరణ్య, వర్ష, దివ్య, శిరీష, హేమ, అమృత, దివ్య, సత్య, కీర్తన, శ్రావ్య, మౌనిక, కుమారి, జ్యోషిత, త్రిషిత, మోహన చరిత, లక్ష్మిశ్రీ, హరిణి, ధితశ్రీ, ప్రణతి, శిరీష, సూర్య, అక్షయ, దేవా హర్షిణి, తేజశ్రీ, అక్ష్య, కనక మహాలక్ష్మి కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. వీరి నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అప్పుల్లో హాస్టళ్లు.. ఆందోళనలో వార్డెన్లు

భోజనాలకు బడ్జెట్ లేక అవస్థలు

ప్రజాశక్తి- ఆనందపురం : విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వసతి గృహాలలోని విద్యార్థులను పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు తింటున్నారా లేదా అన్న విషయం ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలు తెరిచి నాలుగు నెలలు గడిచినా ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు విద్యార్థుల భోజనానికి సంబంధించి బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు ఎవరికి చెప్పుకోలేక, విద్యార్థులకు పెట్టలేక అప్పులతో నెట్టుకొస్తున్నారు. ఆనందపురం బాలుర వసతి గృహాల్లో సుమారు 120 మంది విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి చదువుతున్నారు. బాలికల వసతి గృహంలో సుమారు 80 మంది ఉంటున్నారు. వీరికి నెలకు రూ.లక్షల పైనే ఖర్చు అవుతోంది. గ్యాస్, కాయగూరలు, పప్పులు, పాలు, గుడ్లు అన్ని రకాల వస్తువులను వార్డెన్లే కొని విద్యార్థులకు పెట్టాల్సి వస్తోంది. కిరాణా షాపులకు రూ.లక్షలు అప్పు కావడంతో వారు సరుకులు ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు వార్డెన్లు పడరాని కష్టాలు పడుతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు తెలిసినా బడ్జెట్ రానిది తామేమీ చేయలేమని చెబుతున్నారు. నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నా వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో హాస్టళ్ల దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. ఇలాగే కొనసాగితే వసతి గృహాలు మూతబడి పోతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల బెడదతో బెంబేలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తోటాడ గ్రామ ప్రధాన రహదారిపై వీధికుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా రోడ్డుపైనే సంచరిస్తూ, పాదచారులు, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో వీటి బెడదలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫార్మాసిటీ, స్టీల్‌ప్లాంట్, ఎస్ఇజడ్ తదితర కంపెనీలకు వెళ్లి డ్యూటీలు ముగించుకొని, రాత్రి సమయంలో ఈ మార్గం గుండా వచ్చే వారిని వెంటపడి అటకాయిస్తున్నాయి. కొందరిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలూ ఉన్నాయి. పగటి వేళల్లోనూ ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేయడం, బైకుల్లపై వెళ్లే వారిని వెంబడించడం చేస్తున్నాయి. పరుగులు పెడుతూ వాహనాలకు అడ్డంగా రావటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవడం, గాయాల పాలు కావడం నిత్యకృత్యంగా జరుగుతోంది. ఇక్కడకు సమీపంలో చేపల దుకాణాలు ఉండటంతో వాటి వ్యర్థాలను రోడ్డుపక్క వేస్తుండడంతో వాటిని తినేందుకని అక్కడే తిష్టవేసిన కుక్కల గుంపు, ఇలా అటుగా వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయి. దీనిపై గ్రామపంచాయతీగానీ, సంబంధిత అధికారులుగానీ తగిన చర్యలు తీసుకుని, కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.



రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

జ్యూట్ కార్మికుల సమస్యలపై...

త్వరలో చలో విజయవాడ



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యలపై త్వరలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించేందుకు కాంగ్రెస్ కార్మిక సంఘం, ఎఐటియుసి, టిఎన్‌టియుసి నాయకులు నిర్ణయించారు. ఆదివారం స్థానిక చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో ఆయా సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. మారుపేర్లతో పని చేసిన కార్మికుల సమస్యలపై త్వరలో చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పిఎఫ్, కొత్త బదిలీల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. దరఖాస్తులు చేసుకున్న 274 మంది పిఎఫ్ సొమ్ము వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై ఇటీవల జెసిఎల్‌తో చర్చించిన అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రతినిధి జెవి కైలాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎం.ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి, కె.రాంబాబు, ఎంవి.గురుమూర్తి, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ గ్రూపు ఆలయాల ఇఒగా మురళీ మోహన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక గ్రామ దేవత నూకాలమ్మ గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణాధికారిగా బి.మురళీమోహన్ బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఇక్కడ ఈఓగా పనిచేసిన కీర్తి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా సత్యనారాయణ స్వామి దేవాలయానికి బదిలీ అయ్యారు. మురళీమోహన్ విశాఖ ఎర్నిమాంబ దేవాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.



ఈఓగా మురళీ మోహన్

షూటింగ్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : షూటింగ్ బాల్ క్రీడపై ఆసక్తి ఉన్న మహిళలు, పురుషుల ఎంపిక ఆదివారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 46 మంది పురుషులు, 24 మంది మహిళలు ఎంపికకు హాజరయ్యారు. వీరిలో 12 మంది మహిళలు, 12 మంది పురుషులు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. వీరంతా ఈ నెల 8,9,10 తేదీల్లో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.రవికుమార్ ఆధ్వర్యాన ఎంపిక నిర్వహించారు.

నేటి నుంచి గుడిశ పర్యాటక కేంద్రం మూసివేత

ప్రజాశక్తి -మారేడుమిల్లి: రాబోవు కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలంలోని గుడిశ పర్యాటక కేంద్రాన్ని సన్నద్ధం చేసే క్రమంలో పారిశుధ్యం, రహదారి నిర్వహణ ఇతర పనులకు వీలుగా ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు రెండు వారాలపాటు మూసేస్తున్నట్లు మారేడుమిల్లి అటవీ క్షేత్రాధికారి ఎన్ఎకె. అజాద్ ప్రకటనలో తెలిపారు. ఈవిషయాన్ని దూరప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులు గమనించి, గుడిశ పర్యటనను వాయిదా వేసుకోవాలని సూచించారు. కాగా కార్తీక మాసానికి ఇంకా రెండు నెలలు గడువు ఉన్న నేపథ్యంలో ఇప్పటినుంచే గుడిశ సందర్శనకు పర్యాటకులను అనుమతించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమైతున్నాయి.

కమ్ముకొస్తున్న కరువు ఛాయలు

-కానరాని చినుకు జాడ- ఎండిపోతున్న వరి నారు- ఆందోళనలో అన్నదాతలు



కోటవురట్లలో నీరు లేక ఎండుతున్న నారు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల వ్యాప్తంగా వ్యవసాయ రంగంపై ప్రస్తుత సీజన్లో కరువు ఛాయలు కొమ్ముకొస్తున్నాయి. వర్షానికి వర్షానికి మధ్య దూరం పెరుగుతూ ఉండటంతో ఖరీఫ్ సీజన్ వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలానికి ప్రధాన నీటి వనరు వరాహ, సర్పా నదులు కాగా మెట్ట ప్రాంత రైతులకు తాండవ నీరు ద్వారా వరి సాగు చేస్తూ ఉంటారు. అదేవిధంగా అధిక శాతం బోరు బావులపై ఆధారపడుతూ రైతులు ఉంటారు. నదులు ప్రవహించి తాండవ నీరు పుష్కలంగా వస్తూ ఉంటేనే బోరుబావులు సైతం సక్రమంగా పని చేస్తూ ఉంటాయి.కొన్ని చోట్ల నారుమడులు ప్రస్తుతం రెండు పోతూ ఉండగా , మరి కొన్ని చోట్ల వేసిన నాట్లు గడస బారిపోతున్నాయి వర్షపాతం దుర్భిక్ష పరిస్థితి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆప సోపాలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు అధిక వర్షపాతం నమోదయింది. ప్రధానంగా జూలై, ఆగస్టు నెలలో పడాల్సిన వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతన్నలు వర్షాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజిని ఇచ్చిన వివరాల ప్రకారం మండలంలో 1638 హెక్టార్లు వరి సాగు చేయాల్సి ఉండగా ఇంతవరకు కేవలం 490హెక్టార్లు మాత్రమే నాట్లు వేసినట్లు తెలిపారు.

రోలుగుంట: మూడు రోజులుగా అడపా దడపా కురిసినా నాట్లు వేయుటకు నీరు చేరలేదని మండలంలోని రైతులు వాపోతున్నారు. నారుమడులు వేసి 60 రోజులు పూర్తి అయిందని, ఇక ముందు వర్షాలు ఎక్కువగా పడినా పెట్టుబడి పెట్టి నష్టం వాటిల్లుతుందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జులై మొదటి వారంలో నారుమడులు వేయడం జరిగిందని, ప్రస్తుతానికి 60 రోజులు పూర్తయ్యిందన్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను వివరణ కోరగా నారుపోతలు పోసి 60 రోజులు అవడం వాస్తవమేనని ఇక మీదట నాట్లు వేసిన ఉపయోగం లేదన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయకుమారి మాట్లాడుతూ, మండలంలోని సాధారణ వరి విస్తీర్ణం



రోలుగుంటలో నీరు లేక ఎండుతున్న నారు

1298 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 600 హెక్టార్లలో నాట్లు వేశారన్నారు. 700 హెక్టార్లలో నాట్లు పడలేదన్నారు. బుచ్చింపేట, వడ్డిప, రత్నంపేట, శరభవరం, బిబి.పట్నం, కొంతలం, అడ్డసరం, కంచుగుమ్మల, భోగాపురం, కొవ్వూరు, కొమరవోలు గ్రామాల్లో నాట్లు వేశారన్నారు. గెడ్డలు, కొన్ని పల్లపు ప్రాంతాల్లో నాట్లు వేయడం జరిగిందని, అలాగే కొమరవోలు ఆవ, కల్యాణపులోవ లోవ ఆయకట్టు ప్రాంతాల్లో 700 హెక్టార్లలో నాట్లు వేయడం జరిగిందన్నారు. గుండుబాడు, గుర్రాలపాలెం, జానకిరాంపురం, కుసర్లపూడి, ఎన్.కొత్తూరు గ్రామాల్లో నాట్లు వేయలేదని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆమె తెలిపారు.

ఆటల్లో రాణిస్తున్నా..సౌకర్యాలు సున్నా



బాక్సింగ్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పట్టణంలో బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ వంటి ఆటలలో శిక్షణ పొంది యువతీ యువకులు రాణిస్తున్నారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలను సాధించారు. కానీ వీరికి సరైన సదుపాయాలు, సౌకర్యాలు లేవు. అయినా క్రీడల్లో దూసుకుపోతున్నారు. ఈ క్రీడాకారుల సాధనకు కనీస సౌకర్యాలు కొరవడ్డాయి.మినీ ఎన్టీఆర్ స్టేడియంలోనే శిక్షణ పొందుతున్నారు. బాక్సింగ్ కు ఒక రింగ్ ఏర్పాటు చేయాలని పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి క్రీడాకారులు తీసుకెళ్లినా స్పందించ లేదని వారు వాపోయారు. సాధన చేసేందుకు రింగ్ ఏర్పాటు చేసినట్లయితే మట్టిలో నవరత్నాలు పుట్టించవచ్చని కోచ్ లు తెలిపారు. బాక్సింగ్ పోటీలలో రాష్ట్రస్థాయి 60 మంది, జాతీయస్థాయిలో 30 మంది పతకాలు సాధించారు.ఇటువంటి క్రీడాకారులను మన

బాక్సింగ్ రింగ్ ఏర్పాటు చేయాలి

ఆటల్లో రాణించేందుకు చాలామంది యువతీ యువకులు ఉత్సాహంగా ఉన్నారు. వీరందరికీ శిక్షణ ఇప్పించాలంటే బాక్సింగ్ రింగ్ ఆట స్థలం ఏర్పాటు చేయవలసి ఉంది. ఈ విషయం నింజాస్ అకాడమీ ద్వారా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. నేలపైనే సాధన చేయడంతో క్రీడాకారులకు దెబ్బలు తగులుతున్నాయి.



నింజా అకాడమీ చైర్మన్
వెలగా నారాయణరావు



తలపడుతున్న మహిళా క్రీడాకారులు

నర్సీపట్నంలో ఎంతోమంది నింజాస్ అకాడమీ తయారు చేసింది. ఈ క్రీడాకారులు సాధన చేయాలన్నా.. పోటీలను నిర్వహించాలన్నా స్థలంతో పాటు కింద మెత్తటి మ్యాట్ ఏర్పాటు సౌకర్యాలు ఉంటే బాక్సింగ్ పోటీలకు సాధన చేయవచ్చని క్రీడాకారులు తెలిపారు. కానీ, నర్సీపట్నంలో ఈ సౌకర్యాలు ఏమీ లేవు. దీంతో, క్రీడాకారులు ఎన్టీఆర్ స్టేడియంలో మట్టి నేలపైన సాధన చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్త పైపులైను వేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 635వ రోజుకు చేరింది. ఆదివారం శిబిరం వద్ద మత్స్యకారులు ఆకులతో టోపీలు ధరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, హెటిరో కంపెనీ ఏర్పాటు చేసిన దగ్గర నుండి ఈ ప్రాంతం అంతా విపరీతమైన కాలుష్యంతో నిండి పోయిందని, దీంతో కంపెనీ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు అనేక రకాల రోగాలు బారిన పడి మరణించారని తెలిపారు. అనేకమంది రోగాల బారి పడి లక్షల రూపాయలు అప్పులు చేసి వైద్యం చేయించు కుంటున్నారన్నారు . బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు హెటిరో డ్రగ్స్ యాజమాన్యంతో కుమ్మక్కై మత్స్యకారులను శాశ్వతంగా సముద్రం నుండి దూరం చేయడానికి పైపులైను లు వేసుకోవడానికి అనుమతులు ఇచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.నానాజీ, జీ.సోమేశ్వరరావు, సి. హెచ్.సోమేష్, వి.అప్పారావు, ఎం.బైరాగిరాజు, పై.కోటి, కె.కాశీ పాల్గొన్నారు.



కొత్తకోటలో కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 టెన్త్ క్లాస్ విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేశారు. చాలా కాలం తర్వాత కలవడంతో ఆనాటి అనుభూతులు, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరి కొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి సంఘటనలను నెమరు వేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా.. ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 2008-2009 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి సంఘటనలు, జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కొన్ని సంవత్సరాల తరువాత కలిసిన మిత్రులను ఒకరినొకరు పలకరించుకుని తరగతి గదిలో ఉల్లాసంగా గడిపినట్టుగా పూర్వ విద్యార్థి లోవరాజు తెలిపారు

విద్యార్థులకు ప్లాంక్‌ల పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట: మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో బిసి వసతి గృహ విద్యార్థులకు పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో ప్లాంక్‌లు పంపిణీ చేశారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బలిజి మహరాజు, త్రినాధ్, జగ్గు నాయుడు, పరవాడ దొరబాబు పాల్గొన్నారు.




ప్లాంకులు చూపిస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి: రెండు జిల్లాల సరిహద్దు జిలుగులపాడు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు తక్షణమే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జరుగుతున్న వంతెన పనులను కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి శాంతకుమారి సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ, చిలకగెడ్డ పంచాయతీ పరిది జీలుగులపాడు గ్రామ సమీపంలో వంతెన నిర్మించడంతో ఎన్ ఆర్. పురం, రొంపల్లి పంచాయతీ గ్రామాల తో పాటు విజయనగరం జిల్లా మెంటాడ మండలం అడ్డతీగల పంచాయతీ పరిధి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుందన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-ఎస్‌రాయవరం: జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా మండలంలో పలుచోట్ల బ్లడ్ రక్తదాన శిభిరాలు నిర్వహించారు. తిమ్మాపురం సర్వశుద్ధి, గోకులపాడు గ్రామాలలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం చేపట్టారు. తిమ్మాపురం శిబరంలో సుమారు 130మంది సర్వశుద్ధి గ్రమంలో 30 జన సైనికులు పాల్గొని బ్లడ్ డొనేషన్ చేశారు. సర్వశుద్ధి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మి శివకుమారి, గోకులపాడు గ్రామంలో మత్తి కార్తీక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు గడ్డం బుజి, పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దాత

విద్యుత్ కోతలతో అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల: గడిచిన వారం రోజులుగా నిత్యం రాత్రి సమయంలో ఏడు గంటల నుంచి పది గంటల వరకు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. విద్యుత్తు కోతల కారణంగా పలువురు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే వేసవి తలపిస్తున్న ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ప్రధానంగా వృద్ధులు చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయం కావడంతో దోమలు బెడద తో అల్లాడిపోతున్నారు. వ్యాపార సంస్థలు సహా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద విద్యుత్ అంతరాయంతో రోగులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా అప్రకటిత కరెంటు కోతలు ఆపి నిరంతరం విద్యుత్తు అందజేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.



అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి

చిల్డ్రన్స్ క్లబ్‌తో పిల్లలకు ఉపయోగం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖా గ్రంధాల యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ క్లబ్‌తో పిల్లలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని లైబ్రేరియన్ పి.దమయంతి పేర్కొన్నారు. ఆదివారం గ్రంధాల యంలో నిర్వహించిన చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పాఠశాల సెలవుల సమయంలో లైబ్రరీలో ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ప్రతి ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా పిల్లలు కథల పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లీష్‌లో మెళుకువలు నేర్పించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకరరావు పిల్లలకు చంద్రయాన్ 3పై అవగాహన కల్పించారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్‌లో కాళీ మాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకూ నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎపి నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బుచ్చిరాజు, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, విశాఖ ఐ హాస్పిటల్ డాక్టర్ గోపాలరాజు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల జాతీయ సంగీత, నృత్య, నాటక ఉత్సవాలలో రెండో రోజైన ఆదివారం సాగిన కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథి రియర్ అడ్మిరల్ విజయ శేఖర్, విఎండిఎ అధ్యక్షులు ఎంఎస్ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, ట్రస్టీ డాక్టర్ ఎస్.విజయ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన గాత్ర సంగీత కచేరీలో టిఎం.కృష్ణ మెలోడీస్ అందరినీ మంత్ర ముగ్ధులను చేశాయి. కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ సోమవారం విజయవాడ వారి కూచిపూడి నృత్య రూపకం 'పద్మావతి పరిణయం' ఉంటుందని తెలిపారు.

క్రూయిజ్ టెర్మినల్‌తో విశాఖ అభివృద్ధి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని పోర్టుల అనుసంధానం కోసం చేపట్టిన సాగరమాల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్‌ను ప్రారంభిస్తున్నామని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం విశాఖలోని నోవటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ విశాఖ పోర్టు అథారిటీ, డిసిఐ, మారిటైం యూనివర్సిటీలలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టులపై రివ్యూ నిర్వహించామని తెలిపారు. తాము చేపట్టిన 113 ప్రాజెక్టులలో ఒక్క ఎపిలోనే రూ.1.23 లక్షల కోట్లు పోర్టు కార్యకలాపాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 36 ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలిపారు. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ విశాఖ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్. నరసింహారావు, పోర్టు చైర్మన్ అంగముత్తు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో విఫలం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం నేతల ధ్వజం - పలుచోట్ల సమర భేరి



రోలుగుంటలో కరపత్రాల పంపిణీ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం: **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం సమర భేరి అనకాపల్లిలో పలు గ్రామాల్లో ఆదివారం సాగింది. ప్రజలపై భారాలు తగ్గించి పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు.**

రోలుగుంట: మండలంలోని ఎంకె.పట్నం, అర్ల, గదబపాలెం, గుర్రాలబయలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, ప్రభుత్వాలు ప్రజలపై అనేక భారాలు మోపుతున్నాయన్నారు. విద్యుత్ భారాలు తగ్గించాలని, డీజిల్, పెట్రోల్ ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకీ పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం



కె.కోటపాడులో..

ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, నూకరాజు, సింహాచలం పాల్గొన్నారు

చీడికాడ: మండలంలో పలు గ్రామాల్లో సిపిఎం నేతల ప్రచారం చేశారు.ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ కోణంలో పోస్టర్ విడుదల చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా ధరలను నియంత్రణ చేసి ప్రజల జీవనోపాధిని మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి కుంభైనా కన్నబాబు, ఏడ దేవుడు, సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు, సాయికుమార్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సమరభేరి

కె.కోటపాడు : మండలం కేంద్రంలో సిపిఎం సమరభేరిలో భాగంగా ఆదివారం నిరుద్యోగ వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. నిరుద్యోగులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనబాబు మాట్లాడుతూ నేడు. ఉద్యోగ అవకాశాలు లేక డిగ్రీలు, పిజిలు చదివిన ఎందరో ఉద్యోగాల్లేక కూలి పనులకు వెళ్లే దౌర్భాగ్యస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, వనం సూర్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి: సిపిఎం సమరభేరిలో భాగంగా అధికధరలు, విద్యుత్‌ఛార్జీలమోత, నిరుద్యోగ సమస్యపై చేస్తున్న ఆందోళనలో భాగంగా మండలకేంద్రంలో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలను చైతన్య పరిచారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మాట్లాడుతూ, పాలకుల విధానాల వల్లే నేడు నిరుద్యోగం పెచ్చరిల్లిపోతోందన్నారు. ఈనెల 4న తహశీల్దార్ కార్యాలయాలు వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో ఎ శ్రీను రామాక్రష్ణ ఈశ్వరరావు పాల్గొన్నారు

మునగపాక రూరల్: అధిక ధరలు, విద్యుత్ చార్జీల వడ్డన, నిరుద్యోగ సమస్యలపై సిపిఎం సమరభేరి ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక సంత బయలు, నంది కోవెల ప్రాంతాలలో సభలు నిర్వహించి ప్రజలకు



చీడికాడలో..

అవగాహన కల్పించార. సిపిఎం నేత ఎస్. బ్రహ్మాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు పోటాపోటీగా ప్రజల మీద భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి వి శ్రీనివాసరావు, జగ్గ అప్పారావు, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

పరవాడ: అధిక ధరలు, విద్యుత్ చార్జీలు భారీ వడ్డన, నిరుద్యోగ సమస్యలపై సిపిఎం సమరభేరి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేశపత్ని పాలెం, పి బోనంగి, గ్రామాల్లో సిపిఎం నాయకులు పి మాణిక్యం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పిడి నాయుడు, లక్ష్మి, వెంకటలక్ష్మి రమణమ్మ పాల్గొన్నారు.



పరవాడలో...

పాయకరావుపేట నుంచి పోటీ చేస్తా

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: టిడిపి శ్రేణులు పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత



మాట్లాడుతున్న అనిత

పిలుపునిచ్చారు. నక్కపల్లిలో సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో ఆదివారం పార్టీ శ్రేణులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడన్నారు. పటిష్టమైన వ్యవస్థ టిడిపికి ఉందన్నారు. పార్టీకి కొండంత బలం పార్టీ కార్యకర్తలేనని తెలిపారు. పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఎత్తివేస్తారని అసత్య ప్రచారం చేశారని, మహానాడులో చంద్రబాబు నాయుడు భవిష్యత్తు గ్యారంటీ పథకం వివరించినప్పుడు అసత్య ప్రచారం చేసిన నోర్లు మూతపడ్డాయన్నారు. వైసిపి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. వైసిపి పాలనలో నిత్యవసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీల ధరలు విపరీతంగా పెరిగా యన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ ,మహాశక్తి పథకాలను ఇప్పటికే గ్రామస్థాయిలో ప్రచారం చేయడం జరిగిందని, మరింతగా పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. తాను పాయకరావుపేట నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు మాట్లాడుతూ, గ్రామాల్లో చాలామంది తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని, గ్రామస్థాయి, మండల స్థాయి నాయకత్వంతో చర్చించి అందరి ఆమోదంతో పార్టీలోకి ఆహ్వానించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ,పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, వైబోయిన రమణ, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవిపి.కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలో మూడు రోజులపాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్-15 బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2023 పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ డిఐజి రాజీవ్ కుమార్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను విశాఖలో పనిచేసిన సమయంతో పోల్చుకుంటే నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని, క్రీడలకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రాంగణాలు రూపొందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాదీ రాష్ట్రం నుంచి ఇద్దరు ముగ్గురు క్రీడాకారులు అంతర్జాతీయంగా వెలుగులోకి వస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీ అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, అలాగే విశాఖలోనూ అంతర్జాతీయ స్థాయి అకాడమీలు స్థాపించాలని ఆయన నిర్వాహకులను కోరారు. గౌరవ అతిథిగా ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ డి.చంద్రం, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ పి.అంకం చౌదరి, డిఎస్‌పి అండ్ సిఇఇ ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సిహెచ్.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.ఉషశ్రీ పాల్గొన్నారు.

విజేతలు వీరే

మిక్స్‌డ్ డబుల్స్‌లో టి.చరణ్ రామ్, కె.గగనశ్రీ చౌదరి. బాలికల డబుల్స్‌లో బి.విజయలక్ష్మి, కె.గగనశ్రీ చౌదరి విజేతలుగా నిలవగా, బాలుర డబుల్స్‌లో టి.చరణ్‌రామ్, వి.హరికృష్ణ విజేతలుగా నిలిచారు. అదే విధంగా బాలికల సింగిల్స్ విభాగంలో విశాఖ నగరానికి చెందిన దంగటి జశ్విత విజేతగా నిలవగా బాలుర సింగిల్స్‌లో చిత్తూరుకు చెందిన టి.చరణ్ రామ్ విజేతగా నిలిచారు.

